# ప్రజాతీర్పు — 2024

### తొలి రెండు దశల్లో..
## మహిళా అభ్యర్థులు 8 శాతమే

*న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో 2,823 మంది అభ్యర్థులు పోటీ పడగా, ఇందులో మహిళా అభ్యర్థులు 235 మంది(8 శాతం) మాత్రమే. మొదటి దశలో 135 మంది మహిళలు పోటీపడగా, తమిళనాడు నుంచి అత్యధికంగా 76 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక రెండో దశలో పోటీకి నిలబడ్డ మహిళా అభ్యర్థులు 100 మంది కాగా, అత్యధికంగా కేరళ నుంచి 24 మంది ఉన్నారు. మరింత మంది మహిళా అభ్యర్థులకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వాల్సిందని ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ సుశీలా రామస్వామి అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చే వరకు పార్టీలు ఎందుకు వేచి చూస్తున్నాయి? అని సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.*

# డింకీ కొట్టుడే?

- ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆర్భాటపు హామీలు
- నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసి గెలిపించిన ఓటర్లు
- అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు గాలికి
- గత లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పిన ప్రజలు
- రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికలే రుజువు
- 3 రాష్ట్రాల్లో 65 ఎంపీ సీట్లలో 3 స్థానాల్లోనే గెలుపు
- తెలంగాణలో అధికారంలోకి వచ్చి 5 నెలలవుతున్నా పూర్తికాని కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీమ్‌లు
- వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం: విశ్లేషకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే పరమావధిగా గ్యారెంటీల పేరిట అలవిగాని హామీలను గుప్పిస్తారు. వీటిని నమ్మిన ఓటర్లు అధికారాన్ని కట్టబెడతారు. అయితే, ఇచ్చిన హామీల అమలులో చివరకు చేతులెత్తేస్తారు. అయితే, ప్రజలేమీ అమాయకులు కాదు కదా! తమను వంచించిన వారికి వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారు. ఇదేదో పొలిటికల్ సినిమా స్టోరీ కాదు. కాంగ్రెస్ పార్టీ గురించే. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లో గతంలో, ఇటీవల జరిగిన ఎన్నికలను లోతుగా విశ్లేషిస్తే అసలు తర్కం బోధపడుతుంది.

**రాజస్థాన్‌లో స్కోర్ 'సున్నా'**

అది నవంబర్ 2018. రాజస్థాన్‌కు అసెంబ్లీ ఎన్నికల సమయం. అధికారాన్ని చేపట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ 'జన్ ఘోష్నా పత్ర' పేరిట మ్యానిఫెస్టోలో గ్యారెంటీలను గుప్పించింది. రెండు లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, నిరుద్యోగులకు నెలకు రూ. 3,500 భృతి, రూపాయికే కిలో గోధుమలు, పెట్రోల్-డీజిల్ ధరల తగ్గింపు, యువతులకు ఉచిత విద్య, ప్రతి పంచాయతీకి ఇంటర్నెట్ సదుపాయం తదితర హామీలను ఇచ్చింది. దీంతో కాంగ్రెస్‌ను నమ్మిన ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో గెలిపించి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అశోక్ గెహ్లోట్ సర్కారు మాటతప్పింది. ఉచిత విద్యుత్తు మాట అటుంచితే విద్యుత్తు చార్జీలను పెంచింది. రుణమాఫీని అటకెక్కించింది. రాష్ట్రంలో 33 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే కేవలం లక్ష మందికే అదీ ఒక్క నెల మాత్రమే నిరుద్యోగ భృతినిచ్చి చేతులు దులుపుకొన్నది. మిగతా హామీలను కూడా తుంగలో తొక్కింది. దీంతో మోసాన్ని గ్రహించిన ఓటర్లు.. ఆ తర్వాత ఐదు నెలల వ్యవధిలోనే 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 25 ఎంపీ సీట్లలో ఒక్క స్థానంలో కూడా కాంగ్రెస్‌కు మద్దతు పలుకలేదు. దీంతో ఆ ఎన్నికల్లో హస్తంపార్టీ ఒక్క లోక్‌సభ సీటునూ గెలుచుకోలేదు. దీంతో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ మళ్లీ గ్యారెంటీల కుట్రకు తెరతీసింది. అయితే, ఈసారి హస్తం పార్టీ మోసాన్ని గుర్తించిన ఓటర్లు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి అధికారాన్ని దూరంచేశారు.

**ఛత్తీస్‌గఢ్‌లో ఇలా.. ఎంపీలో అలా..**

2018లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కాంగ్రెస్ పై విధంగానే హామీలను గుప్పించింది. రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన, పేదలకు ఇండ్లు ఇలా పదుల సంఖ్యలో గ్యారెంటీలను ప్రకటించింది. దీంతో ఆ ఎన్నికల్లో ఇరు రాష్ట్రాల ప్రజలు పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, అధికారంలోకి వచ్చాక, ఛత్తీస్‌గఢ్‌లోని బఘేల్ ప్రభుత్వం హామీల అమలును గాలికొదిలేసింది. మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభ నివారణకే పరిమితమైన కమల్‌నాథ్ సర్కారు ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టింది. దీంతో ఐదు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇరు రాష్ట్రాలకు కలిపి మొత్తం 40 సీట్లకు గానూ కాంగ్రెస్‌కు కేవలం మూడు సీట్లనే ఓటర్లు కట్టబెట్టారు. ఇక, 2019 లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 4 ఎంపీ సీట్లలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుపలేదు.

### కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల సరళి

| రాష్ట్రం | 2018 అసెంబ్లీ ఎన్నికలు | | 2019 పార్లమెంట్ ఎన్నికలు | | 2023 అసెంబ్లీ ఎన్నికలు | |
|---|---|---|---|---|---|---|
| | మొత్తం సీట్లు | గెలిచినవి | మొత్తం సీట్లు | గెలిచినవి | మొత్తం సీట్లు | గెలిచినవి |
| రాజస్థాన్ | 200 | 100 | 25 | 0 | 200 | 70 |
| ఛత్తీస్‌గఢ్ | 90 | 68 | 11 | 2 | 90 | 35 |
| మధ్యప్రదేశ్ | 230 | 114 | 29 | 1 | 230 | 66 |

### తెలంగాణ, కర్ణాటకలోనూ అనుమానమే!

ఐదు గ్యారెంటీల పేరిట అటు కర్ణాటకలో, ఆరు గ్యారెంటీలను ఆశగా చూపి ఇటు తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకొన్న కాంగ్రెస్.. హామీల అమలులో మాత్రం చతికిల పడింది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చి పది నెలలైనా హామీల అమలు సంపూర్ణంగా జరుగట్లేదు. ఇటు తెలంగాణలోనూ పాలనాపగ్గాలు చేపట్టి 5 నెలలు అవుతున్నా ఒక్క గ్యారెంటీ కూడా సంపూర్ణంగా నెరవేరలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అటు హిమాచల్‌లోనూ ఇచ్చిన పది హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు. దీంతో అధికార కాంగ్రెస్‌పై ఆయా రాష్ట్రాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీని ప్రభావం వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు రావడం కష్టమేనని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### ఆప్ ఎన్నికల ప్రచార గీతంపై
## ఈసీ నిషేధం: ఆతిశీ

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విడుదల చేసిన పాటపై ఈసీ నిషేధం విధించిందని ఆ పార్టీ నేత, ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఆతిశీ తెలిపారు. 'జైలులో పెట్టినందుకు సమాధానంగా మేము ఓటు వేస్తాం' అనే అర్థం వచ్చే హిందీ పాటను ఈసీ నిషేధించిందని చెప్పారు. బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈ పాటలో చెడుగా చూపించారని ఈసీ చెప్పిందన్నారు. ఓ పార్టీ ప్రచార పాటపై ఈసీ నిషేధం విధించడం బహుశా ఇదే తొలిసారి కావచ్చునన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఇది ఉల్లంఘించలేదని తెలిపారు.

## మాయావతి మేనల్లుడిపై కేసు
### బీజేపీని తాలిబన్‌తో పోల్చిన ఆకాశ్ ఆనంద్

లక్నో: బీఎస్పీ చీఫ్ మాయావతి మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై ఉత్తర ప్రదేశ్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆకాశ్ సీతాపూర్‌లో ఆదివారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, 'ఇది (యూపీ ప్రభుత్వం) ద్రోహుల ప్రభుత్వం. యువతను ఆకలితో అలమటించేలా చేస్తున్న, వృద్ధులను బానిసలుగా మార్చుతున్న ఉగ్రవాద ప్రభుత్వం. ఇలాంటి ప్రభుత్వాన్ని అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు నడుపుతున్నారు' అని అన్నారు. ఆకాశ్‌తోపాటు బీఎస్పీ అభ్యర్థి మహేంద్ర యాదవ్ తదితరులపై కేసు నమోదైంది.

## గుజరాత్ తీరంలో 600 కోట్ల డ్రగ్స్ పట్టివేత
### పాక్ పడవ నుంచి స్వాధీనం

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: గుజరాత్ తీరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. రూ.600 కోట్ల విలువైన 86 కిలోల మత్తు పదార్థాలను భారత తీర ప్రాంత రక్షక దళం(ఐసీజీ) స్వాధీనం చేసుకుంది. పాకిస్థాన్ పడవ నుంచి ఈ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని అందులోని 14 మందిని అరెస్ట్ చేసినట్టు ఐసీజీ ఆదివారం వెల్లడించింది. డ్రగ్స్‌లో ఏయే రకాలున్నాయో ఇంకా పరిశీలించలేదని చెప్పింది. అరేబియా సముద్రంలో అర్ధరాత్రి వేళ రాజ్‌రతన్ నౌక, హెలికాప్టర్ సాయంతో గుజరాత్ ఏటీఎస్, ఎన్‌సీబీ బృందాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి.

## జార్ఖండ్ లోక్‌సభ బరిలో 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు

రాంచీ : జార్ఖండ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. 14 లోక్‌సభ స్థానాలున్న జార్ఖండ్‌లో మే 13న ఎన్నికల పోలింగ్ జరగనున్నది. రాష్ట్రంలో మొత్తం 2.56 కోట్ల మంది ఓటర్లున్నారు. ఇండియా కూటమి నుంచి ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. మొత్తం 12 మంది లోక్‌సభ ఎన్నికల బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ, సీపీఐ-ఎంఎల్.. 'ఇండియా కూటమి'గా ఏర్పడ్డాయి. నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను జేఎంఎం బరిలోకి దింపింది. 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి శీతాకాలంలో ఎన్నికలు జరగనున్నాయి.

## కేజ్రీవాల్‌ను కలిసేందుకు సునీతకు అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తో సమావేశమయ్యేందుకు ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్‌కు తీహార్ జైలు అధికారులు అనుమతిని నిరాకరించారు. షెడ్యూలు ప్రకారం వీరిద్దరి భేటీ సోమవారం జరగవలసి ఉంది. ఎటువంటి కారణం చూపకుండానే సునీతకు అనుమతిని తిరస్కరించారని ఆప్ వర్గాలు మీడియాకు తెలిపాయి. అయితే ఢిల్లీ రాష్ట్ర మంత్రి, ఆప్ నేత ఆతిశీ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులో కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. కేజ్రీవాల్‌ను కలిసేందుకు సునీత, ఆతిశీలకు జైలు అధికారులు అనుమతి ఇచ్చారని, కానీ ఆ తర్వాత సునీతకు అనుమతిని తిరస్కరించారని ఆప్ వర్గాలు తెలిపాయి.

## తగ్గిన పోలింగ్.. కమలం కలవరం

మొదటిపేజీ తరువాయి...

ఉన్నట్టు కనిపిస్తున్నది.

**ఓటింగ్ సరళితో బీజేపీలో కలవరం**

దేశంలో మోదీ వేవ్ ఉన్నట్టు బీజేపీ కొంతకాలంగా ప్రచారం చేసుకుంటున్నది. ఏ ఎన్నికల్లో అయినా వేవ్ ఉంటే ఓటింగ్ పెరుగుతుంది. అయితే, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో ఈ 88 సీట్లలోని 85 సీట్లలో 69.64 శాతం పోలింగ్ జరగగా ఈసారి 63.5 శాతం మాత్రమే నమోదైంది. ఓటింగ్ శాతం తగ్గడం ఒక అంశమైతే.. బీజేపీకి పట్టున్న ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో మరింత తగ్గడం ఆ పార్టీని కలవరపాటుకు గురి చేసే అంశం. రెండో విడతలో యూపీలోని 8 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కేవలం 54.85 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఇవే స్థానాలకు 2019లో 62 శాతం ఓటింగ్ జరిగింది. బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని ఆ పార్టీ నేతలు చెప్తున్న మథురలో గత ఎన్నికలకు ఇప్పటికి ఓటింగ్ 12 శాతం తగ్గింది. ఘజియాబాద్‌లో 6 శాతం తగ్గింది. గత ఎన్నికల్లో ఎన్డీఏ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన మహారాష్ట్రలో 59.6(2019లో 63 శాతం), బీహార్‌లో 57 శాతం(2019లో 63 శాతం), రాజస్థాన్‌లో 64.07 శాతం(2029లో 68 శాతం) నమోదైంది. మరోవైపు బీజేపీకి పెద్దగా పట్టులేని కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం బీజేపీ వ్యతిరేక పవనాలకు సూచిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**భావోద్వేగాలు పని చేయడం లేదా?**

ఓటింగ్ శాతం ఎందుకు తగ్గిందనే అంశానికి సంబంధించి రాజకీయ విశ్లేషకులు పలు కారణాలను చెప్తున్నారు. ముఖ్యంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరేలా చేసే భావోద్వేగ అంశాలేవీ ఈ ఎన్నికల్లో పని చేయడం లేదనేది వారి మాట. తద్వారా రామమందిర నిర్మాణం, మతపరమైన అంశాలను తెరపైకి తేవడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం అవుతున్నట్టు కనిపించడం లేదంటున్నారు. గత ఎన్నికల్లో సొంతంగా 303 సీట్లు సాధించిన బీజేపీ ఈసారి 370 సాధిస్తామని చెప్తున్నది. ఇది జరగాలంటే బీజేపీకి చాలా అనుకూలత ఉండాలి. ప్రజలు ఉత్సాహంగా వచ్చి ఓటేయాలి. కానీ, ఓటర్లు ఉత్సాహంగా వచ్చి ఓటేసేందుకు సిద్ధంగా లేరని, పెరిగిన ధరలు, నిరుద్యోగం, 10 ఏండ్ల ప్రభుత్వంపై వ్యతిరేకత కూడా ఓటింగ్ తగ్గడానికి కారణం కావొచ్చని అభిప్రాయపడుతున్నారు. 102 స్థానాలకు తొలి దఫా పోలింగ్‌లోనూ గత ఎన్నికలతో పోల్చితే దాదాపు నాలుగు శాతం ఓటింగ్ తగ్గింది.

**బీజేపీ సీట్ల సంఖ్యకు కోత**

రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 స్థానాల్లో కేరళలోని 20 స్థానాల్లో నాలుగైదు స్థానాలు మినహా ఎక్కడా బీజేపీ కనీస పోటీ ఇచ్చే స్థితిలో కూడా లేదు. ఇక, గత ఎన్నికల్లో భారీగా సీట్లు గెలిచిన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్రలోనూ ఈసారి బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నది. రైతుల్లో వ్యతిరేకత, నిరుద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి అంశాలు బీజేపీకి ప్రతికూలంగా మారవచ్చు. ఇక, గత ఎన్నికల్లో ప్రతిపక్షాల విచ్ఛిన్నం బీజేపీకి కలిసిరాగా ఈసారి ప్రతిపక్షాలు కొంతవరకు ఐక్యంగా పోరాడుతుండటం, ఎక్కడికక్కడ ప్రాంతీయ పార్టీల జోష్ కనిపిస్తుండటంతో బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. ఇంతకుముందు బీజేపీకి మద్దతుగా నిలిచిన రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు ఈసారి దూరమయ్యారనే అంచనాలు ఉన్నాయి. ఈ అన్ని అంశాలు కలిసి బీజేపీ విజయావకాశాలకు గండి కొడుతున్నాయనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 సీట్లలో గత ఎన్నికల్లో గెలిచిన 63 సీట్ల కంటే ఈసారి లెక్క తగ్గే అవకాశముందని అంచనా.

# బీజేపీకి 'క్షత్రియ' సెగ

- కేంద్రమంత్రి రూపాలా వివాదాస్పద వ్యాఖ్యలు
- బీజేపీకి వ్యతిరేకంగా రాజ్‌పుత్‌ల ఆందోళనలు
- గిరిజనులను ఆకర్షించే పనిలో కాంగ్రెస్-ఆప్
- కంచుకోట గుజరాత్‌లో బీజేపీకి గుబులు
- 26 సీట్లపై గంపెడాశలు పెట్టుకున్న కమలనాథులు

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: మూడోసారి అధికారాన్ని నిలుపుకోవాలని భావిస్తున్న బీజేపీ గుజరాత్‌పై గంపెడాశలు పెట్టుకున్నది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సొంత రాష్ట్రం కావడంతో ఇక్కడ మంచి ఫలితాలు సాధించవచ్చని బీజేపీ నమ్మకంగా ఉన్నది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ మొత్తం 26 స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి కూడా ఇవే ఫలితాలను రిపీట్ చేయాలనుకుంటున్న వేళ క్షత్రియుల రూపంలో బీజేపీకి ఊహించని ప్రతికూలత మొదలయ్యింది.

**బీజేపీకి వ్యతిరేకంగా రాజ్‌పుత్‌ల ఆందోళనలు**

బీజేపీకి క్షత్రియులు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్నారు. క్షత్రియుల్లో రాజ్‌పుత్‌లతో పాటు కొన్ని ఓబీసీ సామాజికవర్గాలు ఉన్నాయి. వీరందరూ బీజేపీ వైపే నిలుస్తూ వచ్చారు. అయితే, మార్చి 22న దళితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్‌పుత్‌లపై కేంద్ర మంత్రి, రాజ్‌కోట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురుషోత్తం రూపాలా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై రాజ్‌పుత్‌లు భగ్గుమన్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ నినదించారు. 109 క్షత్రియ సంఘాలు ఒక్కటయ్యాయి. క్షత్రియుల్లో వ్యతిరేకత గుర్తించిన రూపాలా సహా బీజేపీ నేతలు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. అయినా వీరిలో అసంతృప్తి కొనసాగుతున్నది.

**గిరిజనులను ఆకర్షిస్తున్న కాంగ్రెస్: ఆప్**

కాంగ్రెస్ - ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధానంగా గిరిజన ఓటుబ్యాంకును ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రంలో దాహోద్, ఛోటా ఉదయ్‌పూర్, బర్దోలి, వల్సద్ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్యాయి. భరూచ్‌లోనూ గిరిజనుల జనాభా ఎక్కువ. ప్రధానంగా ఈ సీట్లపై కూటమి కన్నేసింది. రాహుల్ గాంధీ కూడా తన భారత్ జోడో న్యాయ్ యాత్రను ఈ స్థానాల్లోనే కొనసాగించారు.

**బీజేపీకి అంత సులువు కాదా?**

2014, 2019 ఎన్నికల్లో గుజరాత్‌లోని మొత్తం 26 నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించారు. అయితే, ఈసారి మాత్రం వారికి విజయం నల్లేరు మీద నడక కాదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది గుర్తించిన బీజేపీ 14 మంది సిట్టింగ్ ఎంపీలను పక్కన పెట్టింది. కాగా, ప్రభుత్వ వ్యతిరేక ఓటు, మైనారిటీల ఓట్లు కాంగ్రెస్ - ఆమ్ ఆద్మీ పార్టీకి కలిసొచ్చే అవకాశం ఉంది.

## నవాబులు, సుల్తానుల అరాచకాలపై మాట్లాడరేం?
### రాహుల్‌పై మోదీ విమర్శలు

బెళగావి: భారతీయ రాజులు, మహారాజులను అవమానించే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి.. నవాబులు, నిజాంలు, సుల్తానులు, బాద్‌షాలు పాల్పడిన అరాచకాలపై మాట్లాడేందుకు మాత్రం నోరు రాదని ప్రధాని మోదీ విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగానే ఆయన ఈ విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో ఆదివారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఇటీవల ఓ కాలేజీలో జరిగిన విద్యార్థిని హత్య గురించి ఆయన ప్రస్తావించారు. 'వారసత్వ పన్ను' అంశంపై కాంగ్రెస్ లక్ష్యంగా ప్రధాని మోదీ తన ఆరోపణలను కొనసాగించారు. దేవణగెరెలో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఏడాది చొప్పున పంచుకోవాలనేది ఇండియా కూటమి ఫార్ములా అని అన్నారు.

# 'సెక్స్ స్కాండల్'లో ప్రజ్వల్

- జేడీఎస్ ఎంపీ అశ్లీల వీడియోలు వైరల్
- దేవెగౌడ మనవడు ఆయన
- కర్ణాటక రాజకీయాల్లో దుమారం
- ప్రజ్వల్, రేవణ్ణలపై కేసు నమోదు
- జర్మనీ పారిపోయిన ప్రజ్వల్!

బెంగళూరు, ఏప్రిల్ 28: కర్ణాటక రాజకీయాల్లో 'సెక్స్ స్కాండల్' సంచలనంగా మారింది. జేడీఎస్ పార్టీకి చెందిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందినవిగా భావిస్తున్న అశ్లీల వీడియోలు వైరల్‌గా మారాయి. హసన్ నియోజకవర్గానికి శుక్రవారం పోలింగ్ జరగగా అంతకు రెండు రోజుల ముందు నుంచి వీడియోలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవెగౌడకు ప్రజ్వల్ స్వయానా మనవడు కావడంతో ఈ అంశం మరింత సంచలనం సృష్టిస్తున్నది. ప్రజ్వల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు శనివారం ఆందోళన నిర్వహించారు. మరోవైపు, ఓ మహిళ ఫిర్యాదు మేరకు దేవెగౌడ కుమారుడు రేవణ్ణ, ఎంపీ ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది.

**స్పందించిన సీఎం.. సిట్ ఏర్పాటు**

అశ్లీల వీడియోలపై సమగ్ర విచారణకు సీఎం సిద్ధరామయ్య సిట్ ఏర్పాటు చేశారు. వీడియోల్లో ఒక మహిళను లైంగికంగా వేధిస్తున్నట్టు ఉన్నదని ఆయన అన్నారు. హోళెనరసిపుర పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, కుట్రలో భాగంగానే నవీన్ గౌడ అనే వ్యక్తి మార్ఫింగ్ చేసిన వీడియోలను ప్రచారం చేస్తున్నట్టు తన ఎన్నికల ఏజెంట్ ద్వారా ప్రజ్వల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**జర్మనీ పారిపోయిన ప్రజ్వల్!**

సెక్స్ స్కాండల్ ఆరోపణల నేపథ్యంలో శనివారం ఉదయమే ప్రజ్వల్ జర్మనీ పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఒకవేళ ప్రజ్వల్ విదేశాలకు వెళితే అతడిని వెనక్కు తీసుకువచ్చి విచారణ కొనసాగించే బాధ్యత సిట్‌దేనని కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వర తెలిపారు.

## అమెరికాలో పాలస్తీనా అనుకూల నిరసనలు తీవ్రం

వాషింగ్టన్, ఏప్రిల్ 28: అమెరికాలో పాలస్తీనా అనుకూల నిరసనలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. పలు యూనివర్సిటీల్లో భారత్ సహా వివిధ దేశాల విద్యార్థులు పాలస్తీనాకు సంఘీభావంగా, మద్దతుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శిబిరాలు సైతం ఏర్పాటు చేసుకొని పాలస్తీనాకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. దీంతో ప్రతి వర్సిటీలో పదుల సంఖ్యలో విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసనలు విరమించుకోవాలని పలు యూనివర్సిటీల యాజమాన్యాలు విద్యార్థులతో చర్చలు జరుపుతున్నాయి. మరోవైపు నిరసనల సెగలు అమెరికా అధ్యక్షుడి నివాస భవనం వైట్ హౌస్‌ను కూడా తాకాయి. బైడెన్ వైట్ హౌస్‌లో ఇచ్చే ఎన్నికల ఏడాది విందుకు హాజరైన వేలాది జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలను నిరసనకారులు విమర్శించారు. పాలస్తీనాకు స్వేచ్ఛ ఇవ్వండి అంటూ నినాదాలు చేశారు.

# కాంగ్రెస్‌లో పాత్తు మంటలు

- ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడి రాజీనామా
- లోక్‌సభ ఎన్నికల వేళ ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ కాంగ్రెస్‌లో పొత్తు మంటలు రేగాయి. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తును వ్యతిరేకిస్తున్న ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాజీనామా లేఖ పంపారు. కాంగ్రెస్‌పై తప్పుడు, అబద్ధపు, అవినీతి ఆరోపణలు చేసి ఆప్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీతో పొత్తు ఢిల్లీ కాంగ్రెస్ నేతలెవరికీ ఇష్టం లేదని అర్విందర్ పేర్కొన్నారు. అయినా కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవడాన్ని తప్పుబట్టారు. ఢిల్లీ ఏఐసీసీ ఇంచార్జి దీపక్ బబ్రియా వైఖరి సరిగా లేదని, ఢిల్లీ శాఖలోని పార్టీ సీనియర్లు తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాలను కూడా ఆయన ఏకపక్షంగా పక్కకు పెట్టేశారని లవ్లీ ఆరోపించారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను కాపాడలేనప్పుడు, తాను పీసీసీ అధ్యక్ష పదవిలో ఉండలేనని పేర్కొన్నారు. దీపక్ బబ్రియాతో పొసగక ఇటీవలే మాజీ మంత్రి, ఏఐసీసీ సభ్యుడు రాజ్‌కుమార్ చౌహాన్ కూడా రాజీనామా చేశారు.

**బీజేపీ అభ్యర్థిగా లవ్లీ ?**

అర్విందర్ సింగ్ లవ్లీని తూర్పు ఢిల్లీ స్థానం నుంచి హర్ష్ మల్హోత్రాకు బదులుగా బీజేపీ పోటీకి నిలపనున్నట్టు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ మహమ్మద్ ఖాన్ ఆరో